VISION BHARATH REPORTER
విభారే
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారే" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 17-05-2024 సంపుటి : 06 సంచిక : 243 పేజీలు : 8 వెల : రూ 3-00

# పేదల అభివృద్ధి కోసం రాత్రి పగలు కష్టపడుతున్నా : మోడీ




హైదరాబాద్, మే 16, పేదల అభివృద్ధి కోసం రాత్రి పగలు కష్టపడుతున్నానని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. మీ బాధలను ఒక్కొకటిగా తొలగిస్తున్నామని చెప్పారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర ప్రదేశ్ లో ప్రధాని మోడీ పర్యటిస్తున్నారు. అజాంఘర్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ.. 'ఎక్కడికెళ్లినా ఒకటే మాట వినిపిస్తోంది.. అదే ఫిర్ ఏక్ బార్.. 400 పార్' అని చెప్పారు. దేశ ప్రజలంతా మోడీనే మళ్లీ ప్రధాని అంటున్నారని ఆయన చెప్పారు.మోడీ గ్యారెంటీపై ప్రజలకు నమ్మకం ఉందని.. అందుకు, సీఏఏ చట్టమే ఉదాహరణ అని ప్రధాని చెప్పారు. సీఏఏ కింద భారత్ పౌరసత్వం ఇవ్వడం ప్రారంభమైందన్నారు. దేశంలో వీరంతా చాలా ఏళ్లుగా శరణార్థులుగా ఉన్నారని చెప్పారు. మోడీ వెళ్తే సీఏఏ కూడా వెళ్తుందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని.. సీఏఏను ఎవరూ ఆపలేరన్నారు.విపక్ష కూటమి ఓటు బ్యాంక్ రాజకీయం చేస్తోందని మోడీ విమర్శించారు. ఇండియా కూటమి పేదల రిజర్వేషన్లను ముస్లింలకు కేటాయిస్తామంటున్నారని.. మైనార్టీలకు బడ్జెట్ లో 50శాతం ఖర్చు చేస్తామంటున్నారని మండిపడ్డారు. 70ఏళ్లుగా హిందువులు, ముస్లింలు అంటూ విభజించి రాజకీయం చేశారని విపక్షాలపై ఫైర్ అయ్యారు. దేశమంతా ఇప్పుడు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవంపై కూడా ఇండియా కూటమి విమర్శలు చేసిందని చెప్పారు. ప్రజలంతా ఎన్డీఏ కూటమితోనే ఉన్నారని.. మూడో సారి బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ప్రధాని మోడీ చెప్పారు.

# ఢిల్లీలో సీఈసీ ముందు హాజరైన ఏపీ సీఎస్, డీజీపీ




అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్‌రెడ్డి డీజీపీ హరీస్ గుప్తా గురువారం మధ్యాహ్నం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలిసి వివరించారు.ఈనెల 13న జరిగిన ఎన్నికల రోజు, మరుసటి రోజు రాష్ట్రంలోని పలు జిల్లాలో హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. దీనిపై గురువారం మధ్యాహ్నం స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఇద్దరిని ఆదేశించడంతో సీఎస్, డీజీపీ ఢిల్లీకి బయలు దేరి సీఈసీని కలిశారు. పల్నాడు, కారంపూడి, చంద్రగిరి, తాడిపత్రిలో ఘర్షణలు ఎందుకు జరిగాయని, పోలీసుల నిఘా సంస్థ ఎందుకు గట్టి చర్యలు తీసుకోలేకపోయిందని ప్రశ్నించారు.పోలింగ్ రోజున పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించిన విషయాన్ని ఎన్నికల పరిశీలకులు ఈసీకి నివేదిక ఇవ్వడంతో వాటి గురించి కూడా ఇద్దరిని ప్రశ్నించారు. బందోబస్తు విషయంలో నిర్లక్ష్యం వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో జరిగిన ఘటనలు, తీసుకున్న చర్యలు, భవిష్యత్‌లో తీసుకోబోయే చర్యలను సీఎస్, డీజీపీలు నివేదిక రూపంలో అందజేశారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం



హైదరాబాద్, మే 16, హైదరాబాద్ నగరంలో గురువాతం మూడు వర్షం బీభత్సం సృష్టించింది. సుమారు ఒక గంటపాటు వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. రోడ్లన్నీ వరద నీటితో నిండిపోయాయి. పంజాగుట్ట, జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, బేగంపేట, అమీర్ పేట, సికింద్రాబాద్, కూకట్ పల్లి, రాయదుర్గ, ఉప్పల్, ఎల్ బినగర్, దిల్ సుఖ్ నగర్, కోఠి, నారాయణ గూడ పలు ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. దీంతో రాయదుర్గం, జూబ్లీహిల్స్ బంజారాహిల్ష్, పంజాగుట్ట ప్రాంతాలలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.తెలంగాణలో మరో ఐదు రోజుల తేలికపాటి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ వాఖ తెలిపింది. గంటకు 40 కిలో మీటర్ల నుంచి 50 కిలో మీటర్ల వేగంతో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తెలంగాణలో ఆగ్నేయ దిశగా గాలులు వీయడంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ నైరుతి ప్రాంతంలో ఆవర్తనం సముద్ర మట్టానికి 0.9 కిలో ఎత్తులో ఉందని వివరించింది.

# ఎపిలో ఇసుక అక్రమ తవ్వకాలు

**ఎన్జీటీ ఆదేశాలకు విరుద్ధంగా చర్యలు**
**ఎపి ప్రభుత్వ తీరుపై సుప్రీం ఆగ్రహం**
**ఇసుక అక్రమ తవ్వకాల నిరోధానికి కమిటీ**
**తదుపరి విచారణ జూలై 15కు వాయిదా**




న్యూఢిల్లీ,మే16: ఏపీలో అక్రమ ఇసుక తవ్వకాలపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీం ఆదేశాలను సైతం పట్టించుకోకుండా యథేచ్ఛగా అక్రమ ఇసుక తవ్వకాలను సాగించిన ఏపీ ప్రభుత్వంపై సుప్రీం ధర్మాసనం మండిపడింది. అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపివేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. కమిటీలో కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధి కారులను కూడా నియమించాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. నాలుగు రోజుల్లోపు అక్రమ ఇసుక రీచ్‌లను సందర్శించి వాటిని నిలిపివేయడానికి తగిన చర్యలను తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతి జిల్లాలో ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక సెల్ లను కూడా ఏర్పాటు చేయాలని సుప్రీం ఆదేశించింది.అక్రమ ఇసుక తవ్వకాలను నిషేదించడానికి పెద్ద ఎత్తున పబ్లిసిటీ ఇవ్వాలి. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్లు, ఈ మెయిల్ ఐడీలను కూడా ఏర్పాటు చేయాలి. తమ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కార చర్యలను తీసుకుంటాం. కమిటీలోని అధికారులు సుప్రీంకోర్టు నియమించిన అధికారులుగా గుర్తెరిగి విధులను నిర్వర్తించాలి. ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోండని సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో యథేచ్ఛగా అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ ధృవీకరించింది. ఆ మేరకు మధ్యంతర నివేదికను సమర్పించింది. 10 వేల కోట్ల రూపాయల మేరకు అక్రమ ఇసుక రవాణా జరిగిందని ప్రతివాది తరపు న్యాయవాది సిద్దార్థ లూథ్రా.. సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం కొనసాగిస్తున్న అక్రమ ఇసుక తవ్వకాలను ఫోటోలు, ఆధారాల సహా ప్రతివాది దండా నాగేంద్ర కుమార్ నేడు సుప్రీం ముందు ఉంచారు. జస్టిస్ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. అక్రమ ఇసుక తవ్వకాలను తక్షణం నిలిపివేయడానికి వెంటనే అధికారుల బృందాలను క్షేత్ర స్థాయికి పంపాలని గత వారం సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ అధికారులు కూడా క్షేత్ర స్థాయికి వెళ్లి అక్రమ ఇసుక తవ్వకాలు ఆపేశారా.. లేదా? అన్నది తనిఖీ చేయాలని కూడా సుప్రీం ఆదేశించింది. ఇసుక అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను సుప్రీం ధర్మాసనం తిరస్కరించింది. ఏపీ ప్రభుత్వం చర్యలన్నీ కాగితాలకే పరిమితమని తమకు తెలుసని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. నేడు సుప్రీంకోర్టు అక్రమ ఇసుక తవ్వకాల నిలిపివేతపై తీసుకున్న చర్యలను అఫిడవిట్ రూపంలో సమర్పించాలని ఏపీ ప్రభుత్వాన్ని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలు ఇంకా కొనసాగుతున్నాయంటూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ కూడా సుప్రీంకోర్టుకు నివేదించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇసుక తవ్వకాలపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు విడుదల చేసింది. ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో పోలీసు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. టోల్‌ఫ్రీ నంబర్, ఈమెయిల్ ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించింది. కేంద్ర పర్యావరణశాఖ తరచూ తనిఖీలు చేపట్టాలని.. ఆ సమాచారాన్ని రాష్ట్ర అధికారులకు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు చెప్పాక కూడా యంత్రాలు వాడారని కేంద్ర పర్యావరణశాఖ తరపు న్యాయవాది తెలపగా.. కోర్టు ఉత్తర్వులను అనంతరం తదుపరి విచారణ జులై 15కి వాయిదా వేసింది.

# మహానాడు కార్యక్రమానికి బ్రేక్

**ఎన్నికల ఫలితాల కారణంగా రద్దు**
**యధావిధిగా గ్రామాల్లో రక్తదాన శిబిరాలు**
**జెండా విష్కరణలు చేపట్టాలి: బాబు**

అమరావతి,మే16: ప్రతీ ఏటా పండుగలా జరిగే టీడీపీ మహానాడు కార్యక్రమానికి ఈసారి కాస్త బ్రేక్ పడింది. అందుకు ఎన్నికల పలితాలే కారణం. ఈనెల 27, 28 తేదీల్లో టీడీపీ మహానాడు జరగాల్సి ఉంది. అయితే జూన్ 4న ఎన్నికల ఫలితాలు, అందుకు ఏర్పాట్లు, అనంతరం ప్రభుత్వం ఏర్పాటు హడావుడి ఉండటంతో వాయిదా వేయాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. ఈ విషయాన్ని టెలికాన్ఫరెన్స్‌లో అధినేత చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అయితే మహానాడు మాదిరిగా అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్‌కు నివాళి, పార్టీ జెండాలు ఎగురవేయడం, రక్తదాన శిబిరాలు యధావిధిగా ఉంటాయని అధినేత చెప్పారు. తిరిగి ఎప్పుడు మహానాడు నిర్వహిచాలి?.. తేదీలపై మరోసారి ప్రకటన చేద్దామని టీడీపీ చీఫ్ పేర్కొన్నారు. తాడిపత్రిలో టీడీపీ సానుభూతిపరులపై డీఎస్పీ చైతన్య చేసిన దాడిపై చంద్రబాబు సీరియస్ అయ్యారు. అతను రాజంపేట నుంచి తాడిపత్రి ఎలా వచ్చారని బాబు ప్రశ్నించారు.. డీఎస్పీ ఆగడాలు, దౌర్జన్యకాండపై ఎన్నికల కమిషన్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే చీఫ్ సెక్రటరీ వ్యవహార శైలిపై చంద్రబాబు, పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ రెండు రోజులు ముందు డీబీటీకి నిధుల విడుదలపై హడావుడి చేయడం ఏంటని చంద్రబాబు ప్రశ్నించారు. వృద్ధుల పెన్షన్ల విషయంలో సీఎస్ వ్యవహారశైలిని కూడా టీడీపీ నేతలు ప్రస్తావించారు. అన్ని గుర్తు ఉంటాయంటూ ఈ సందర్భంగా చంద్రబాబు చెప్పారు.



# మళ్లీ అధికారంలోకి రాబోతున్నాం: సిఎం జగన్



ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మళ్లీ తామే అధికారంలోకి వస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఐప్యాక్ కార్యాలయంలో జగన్ మాట్లాడుతూ ఎపిలో మరోసారి వైసిపి ప్రభంజనం సృష్టిస్తుందని చెప్పారు. 2019లో 151 సీట్లు, 22 ఎంపీ సీట్లు గెలిచామని ఈసారి అంతకంటే ఎక్కువ సీట్లే గెలుస్తామని జోస్యం చెప్పారు.రానున్న రోజుల్లో ఈ ప్రయాణం ఇలానే కొనసాగుతుందని .. ఈ ఐదేళ్ల కంటే ఎక్కువగా వచ్చే ప్రభుత్వంలో ప్రజలకు మేలు చేస్తామన్నారు. జూన్ 4న ఫలితాలు చూసి దేశం షాక్ అవుతుందన్నారు. మరోసారి 22 ఎంపీ సీట్లు గెలవబోతున్నామని జగన్ అన్నారు. ఎపి ఎన్నికల ఫలితాలు చూసి ప్రశాంత్ కిషోర్ షాకవుతారని చెప్పారు. ప్రశాంత్ కిషోర్ చేసేది ఏం లేదని.. వర్క్ అంతా టీమే చేస్తోందన్నారు. 2029లోనూ ఐప్యాక్ టీమ్‌తోనే పనిచేస్తానని సిఎం జగన్ తెలిపారు.

## చెరువులో పడి ముగ్గురు బాలికల మృతి

తిరుపతి,మే16: తిరుపతి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు చేరువులో పడి ముగ్గురు బాలికలు మృతి చెందారు. వడమాలపేట మండలం ఎస్బీఆర్‌పురానికి చెందిన బాలికలు స్థానిక శివాలయానికి వెళ్లారు. ఆ పక్కనే ఉన్న చెరువు దగ్గరకు వెళ్లగా వారు ప్రమాదవశాత్తు చెరువులో పడ్డారు. తొలుత ఓ బాలిక పడటంతో మిగిలిన ఇద్దరూ రక్షించే ప్రయత్నం చేశారు. కానీ వాళ్లు కూడా చెరువులో పడ్డారని తెలుస్తోంది. ముగ్గురు బాలికల మృతదేహాలను ి పోస్టుమార్టంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురు బాలికల మృతిలో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

# సంపాదకీయం

శుక్రవారం 17-05-2024

## మిత్రపక్షాలు మద్దతు తప్పని సరా

బిజెపికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయా? ఆ పార్టీ మ్యాజిక్ ఫిగర్ దాటడం కష్టమా? నాలుగు విడతల్లో పూర్తయిన పోలింగ్లో ఆ పార్టీ వెనుకబడిందా? తక్కువ శాతం ఓట్లు పోలింగ్ కావడం దేనికి సంకేతం? ఇండియన్ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. గత ఎన్నికల్లో సూపర్ విక్టరీ సాధించిన భారతీయ జనతా పార్టీకి ఎన్నికల్లో ఇబ్బందికర పరిస్థితులు తప్పవని తెలుస్తోంది. బిజెపి ఒంటరిగా మ్యాజిక్ ఫిగర్ దాటే అవకాశం లేదని.. మిత్రపక్షాల అవసరం తప్పనిసరి అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బిజెపి మాత్రం ఈ ఎన్నికల్లో ఒంటరిగా 370 సీట్లు, మిత్రపక్షాలతో కలిసి 400 సీట్లు దక్కించుకోవాలన్న ఆలోచనలో ఉంది. కానీ అది అంత ఈజీ కాదని తెలుస్తోంది.దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు ఏడు దశల్లో జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే నాలుగు విడతల్లో పోలింగ్ పూర్తయింది. జూన్ 1 తో ఏడో దశ పోలింగ్ ముగియనుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. కనీసం 400 లోక్సభ స్థానాలను లక్ష్యంగా పెట్టుకొని బిజెపి ఎన్నికల్లో గట్టిగానే శ్రమించింది. అయితే సొంతంగా మ్యాజిక్ ఫిగర్ దాటి అవకాశం లేదని తెలియడంతో కమలనాథుల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది. ఇప్పటివరకు జరిగిన నాలుగు దశల పోలింగ్ లో తక్కువ కూలింగ్ శాతం నమోదయింది. ఇది అధికార పార్టీలో కలవరానికి కారణమవుతోంది. ఏప్రిల్ 19న జరిగిన తొలి దశ పోలింగ్ ను.. గత ఎన్నికలతో పోల్చుకుంటే నాలుగు శాతం ఓటింగ్ తక్కువగా నమోదయింది. అదే నెల 26న జరిగిన రెండో విడత పోలింగ్లో మూడు శాతం తక్కువగానే పోలింగ్ నమోదయింది. మూడో దశలో 1.2%, నాలుగో దశలో 2.3 శాతం ఓటింగ్ తక్కువగా నమోదు అయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీంతో మోడీ గ్రాఫ్ పడిపోయిందన్న సంకేతాలు రావడం బీజేపీకి లోటు.ప్రస్తుతం బిజెపి కాశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడానికి గొప్పగా చెప్పుకుంటుంది. దేశవ్యాప్తంగా దానినే ప్రచారాస్త్రంగా మార్చుకుంది. కానీ కాశ్మీర్లో బిజెపి పోటీ చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కాశ్మీర్ లోక్సభ ఎన్నికల బరిలో ఏ ఒక్క బీజేపీ అభ్యర్థి కూడా లేకపోవడం రికార్డ్. కాశ్మీర్లో మూడు లోక్సభ స్థానాలు ఉన్నాయి. ఒక్కచోట కూడా బిజెపి పోటీలో పెట్టలేదు. బిజెపి గ్రాఫ్ పడిపోవడం వల్లే అక్కడ పోటీ చేయడం లేదన్న ప్రచారం ఉంది. అయితే కాశ్మీర్ విషయం పక్కన పెడితే.. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 272 సీట్లు రావాలి.. కానీ విజయం ముంగిట బిజెపి నిలిచిపోతుందని? అప్పుడు స్నేహితుల మద్దతు కీలకమవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ విశ్లేషణలతో కాషాయ దళంలో కలవరం రేగింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేస్తున్న నియోజకవర్గం వారణాసి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హిందూ మతంలో అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రాల్లో ఒకటిగానే కాదు, భూమ్మీద వేల ఏళ్లుగా మనుగడలో ఉన్న చారిత్రక నగరంగానూ వారణాసి ప్రసిద్ధిగాంచింది. 2014లో మోదీ తన సొంత రాష్ట్రం గుజరాత్లోని వడోదర లోక్సభ నియోజకవర్గంతో పాటు వ్యూహాత్మకంగా వారణాసిలోనూ పోటీ చేశారు. ఈ చర్య ఉత్తర్ప్రదేశ్లో అత్యధిక సీట్లు గెలుపొంది కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు దోహదపడింది. 2019లో మరోసారి పోటీ చేసి గెలుపొందగా, ఇప్పుడు మూడోసారి మోదీ మళ్లీ పోటీ చేస్తున్నారు. జూన్ 1న చివరి విడతలో భాగంగా పోలింగ్ జరుపుకోనున్న ఈ నియోజకవర్గంలో మోదీని మరింత భారీ మెజారిటీతో గెలిపించడం కోసం పార్టీ శ్రేణులు శ్రమిస్తున్నాయి. మోదీని ఓడించడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా జట్టుకట్టిన విపక్షాలు.. ఈ నియోజకవర్గంలోనూ ఐక్య పోరాటం చేస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్‌ను గెలిపించడం కోసం ఆ పార్టీతో పాటు రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీ సమాజ్‌వాదీ కూడా శ్రమిస్తోంది. అజయ్ రాయ్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగానూ ఉన్న విషయం గమనార్హం. “అబ్‌కీ బార్ దస్ లాఖ్ పార్” అంటూ మొత్తం 10 లక్షల ఓట్లు దాటి మోదీకి పోలయ్యేలా రాజకీయ నినాదంతో బీజేపీ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తద్వారా 7 లక్షలకు పైగా మెజారిటీ సాధించవచ్చన్నది వారి ఆలోచనగా కనిపిస్తోంది. 1991 నుంచి ఈ స్థానంలో మోదీ హయంలో కాశీలో జరిగిన అభివృద్ధి, కాశీ విశ్వనాథ్ కారిడార్ ఏర్పాటు, నగరంలో మౌలిక వసతులు, విమానాశ్రయం, రైల్వే స్టేషన్ల అభివృద్ధి, ఆధునీకరణతో పాటు నగరంలో ఎక్కడికక్కడ వంతెనల నిర్మాణం గురించి కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారు. అలాగే నిర్మాణంలో ఉన్న క్యాన్సర్ ఆస్పత్రి, క్రికెట్ స్టేడియం, నగరంలో అమలు చేస్తున్న పరిశుభ్రత వంటివి కూడా కలిసొచ్చే అంశాలు. కొన్ని దశాబ్దాలుగా ఈ నగరాన్ని సందర్శిస్తున్న దేశ, విదేశీ యాత్రికులు నగరంలో చోటుచేసుకుంటున్న మార్పులు, జరుగుతున్న అభివృద్ధి, పెరిగిన మౌలిక వసతులను ప్రత్యక్షంగా గమనిస్తున్నారు.

## వారంలో నైరుతి వానలు

హైదరాబాద్, మే 16,మూడేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతన్నలకు వాతావరణశాఖ శుభవార్త అందజేసింది. ఈ ఏడాది జూన్ కన్నా ముందుగానే నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉంది. మే 31నే నైరుతి రుతుపవనాలు రానున్నట్లు ఎ.ఓ.ఆ. వెల్లడించింది..మండుతున్న ఎండాకాలం ప్రజలందరికీ వాతావరణశాఖ చల్లటి కబురు పంపింది. ఈనెల 31నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. మూడేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రైతులు నష్టపోయారు. వర్షాలు లేక జలాశయాలన్నీ ఖాళీ



అయ్యాయి. రుతుపవనాలు రాకతో విస్తరంగా వర్షాలు కురవనున్నాయి. సరైన సమయంలో రుతుపవనాలు పలకరిస్తే....సకాలంలో పంటలు వేయడం వల్ల ఆ తర్వాత వచ్చే తుపాన్‌లు, వరదల నుంచి పంటను కాపాడుకునే అవకాశం ఉంది. వాతావరణశాఖ తెలిపిన చల్లని కబురుతో రైతుల ముఖంలో వెలుగులు నిండాయి. ఇప్పటికే పంటపొలాలను సిద్ధం చేసుకుని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మనదేశంలో నైరుతి రుతుపవనాల వల్లే విస్తరంగా వర్షాలు కురుస్తాయి. వర్షాధార పంటలకూ ఇవే ఆధారం. దేశంలో జూన్, జులై నెలలో పడే వర్షాలే అత్యంత కీలకం. సాధారణంగా నైరుతి రుతుపవనాలు కొంచెం అటు, ఇటుగా జూన్ తొలివారంలోనే దేశంలోకి ప్రవేశిస్తాయి. గతేడాది జూన్ 8న రాగా...ఈసారి వారం రోజులు ముందుగానే పలకరించనున్నాయి. ఒకసారి కేరళలోకి ప్రవేశించిన తర్వాత వారం పదిరోజుల్లోనే దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. తెలంగాణ, ఏపీ భూభాగంపైకి విస్తరించి సమృద్ధిగా వర్షాలు కురిపిస్తాయి. వాతావరణశాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపింది. రుతుపవనాల సీజన్‌లో 106 శాతం వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేసింది. ఆగస్టు- సెప్టెంబరు నాటికి ఎక్కువ వర్షపాతం నమోదు కావచ్చని వెల్లడించింది. వాయవ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. గతేడాది నైరుతి రుతుపవనాలు రాక ఆలస్యం కావడంతోపాటు..దేశంలోనూ వివిధ ప్రాంతాలకు ఆలస్యంగా విస్తరించడంతో తొలకరి జల్లుల కోసం రైతులు కళ్లు కాయలు కాసే వరకు ఎదురు చూశారు. పైగా నైరుతి రుతుపవనాల ప్రభావం కూడా తొలినాళ్లలో పెద్దగా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని చిరుజల్లులు కురిపించడంతో ఆశగా పంటలు వేసి ఆకాశం వైపు ఎదురుచూడటమే పనైపోయింది. వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయి. రైతులు ఆ పంటలను దున్ని మళ్లీ నాటుకోవాల్సి వచ్చింది. వర్షాధార పంటలపైనే ఆధారపడే తెలుగు రాష్ట్రాల ప్రజలకు నైరుతి రుతుపవనాల రాక ఎంతో కీలకం. అనుకున్న సమయం కన్నా ఆలస్యం కావడం వల్ల తొలినాళ్లలో వర్షాలు లేక ఇబ్బందిపడిన రైతులు... ఆ తర్వాత పంటలు చేతికొచ్చే సమయంలో కుంభవృష్టితో మరోసారి నష్టపోయారు.ఈసారి సకాలంలో వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ కబురుతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. అదునులోనే పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. గతేడాది మిగిల్చిన పంట నష్టాలను సైతం ఈసారి పూడ్చుకోవాలని వరుణ దేవుడిని వేడుకుంటున్నారు..

## బీజేపీలో జోష్ నింపిన పార్లమెంట్ ఎన్నికలు

-పెద్దపల్లి సీటు పక్కా బీజేపీదే అంటున్న సర్వేలు
-బీజేపీకి కలిసి వచ్చిన ఓటు క్రాసింగ్
-గ్రామాల్లో వెలిగిన మోడీ చరిష్మా
-మోడీకి కానుకగా పెద్దపల్లి పార్లమెంట్ స్థానం
-బీజేపీ గెలిస్తే ఢిల్లీ దాకా మారు మ్రోగనున్న పెద్దపల్లి కీర్తి

, పెద్దపల్లి ప్రతినిధి: పార్లమెంట్ లోక్ సభ ఎన్నికలు ఈసారి బీజేపీ పార్టీలో జోష్ పెంచిందనే చెప్పాలి. ఇందులో ప్రధానంగా పెద్దపల్లిలో జరిగిన ఎన్నికలు మరి మరి విశేషంగా చెప్పవచ్చు. ఈసారి జరుగుతున్న ఎన్నికలు ఒకవైపు హిందుత్వవాదం పేరుతో మరోవైపు లౌకికవాదం పేరుతో జోరుగా ప్రచారాలు సాగిస్తున్నాయి ఆయా పార్టీల నాయకులు. ఇక అసలు విషయానికి వస్తే పెద్దపెల్లి పార్లమెంటు చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఈసారి ఎన్నికలు జరిగాయి. ఓటింగ్ శాతం తీసుకుంటే వందకు 60 మంది ఓటు వేసినా ఇందులో ప్రధానంగా చెప్పుకోవాల్సిన విశేషమేంటంటే మూడోతరం నాయకుడైన గడ్డం వంశీకృష్ణకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడం. 24 ఏళ్ల యువకుడు ఇద్దరు ఉద్దండులు, గుర్తింపు ఉన్న పార్టీలతో తలపడ్డారు. ఇటు టీఆర్ ఎస్ నుండి కాకలు తీరిన ఉద్యమ బిడ్డ, మాజీ రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, మరో వైపు బీజేపీ బ్రాండ్, మోడీ చరిష్మా తో మరో సారి తన అదృష్టం పరీక్షించు కుంటున్న గోమాస శ్రీనివాస్. వీరిలో ఎవరికి వారే పలు ప్రత్యేకతలు ఉన్నా, ముఖ్యంగా ఇక్కడ చర్చించు కోవాల్సింది పార్టీల గురించే. ఇద్దరూ సీనియర్ నాయకుల మధ్యలో ఒక యువ నాయకత్వం గెలుపు ఓటమిలో నిర్ణయించే ఓటర్ల మధ్యలో నిలబడి ఓటు వేసిన గెలుపు కోసం వేచి చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా మతతత్వ బీజేపీ పార్టీ అంటూ ప్రచారం చేస్తే, బీజేపీ మాత్రం అభివృద్ధి మీదనే ప్రచారం దృష్టి సారించింది. ఇక సోషల్ మీడియా మాత్రం అన్ని మసాలలతో ఘాటుగా ప్రచారం చేసిందనే చెప్పాలి. ఇక మోడీని చూసే ఓటు వేయాలని చేసిన ప్రచారం కూడా గ్రామాల్లో సైతం బలంగా నాటుకు పోయింది. అసెంబ్లీ ఎన్నికల నాటికి ప్రస్తుతం పెద్దపల్లిలో బీజేపీలో వర్గ పోరు కనిపించినా అది ఈసారి ఓటర్లను ప్రభావితం చేయలేక పోయింది. పెద్దపల్లిలో బీజేపీ గెలుపు ఖాయమే అనే స్థాయిలో ప్రచారం జోరుగా సాగింది. అలాగే ప్రాంతీయ పార్టీ అయిన టీఆర్ ఎస్ కు బలం ఉన్నా, కేంద్రంలో ఏమి చేస్తుందనే భావన స్థానిక ఓటర్లలో కనిపించింది. యువకులు గ్రామీణ ప్రాంతం ప్రజలు కొంత వరకు బీజేపీకి ఓటు వేశారు. దీనికి తోడుగా శ్రీరామ అక్షింతల సెంటిమెంట్, హిందూ త్వ వాదన కూడా ప్రజల్లోకి చొచ్చుకు పోయింది. దీంతో కాంగ్రెస్, టీఆర్ ఎస్ అనే పార్టీలతో సంబంధం లేకుండా ఏక పక్ష తీర్పు ఇవ్వనున్నట్లు ఓటింగ్ సరళిని చూస్తే అర్ధమవుతుంది. 17 లోక సభ ఎన్నికలు ఒక ఎత్తు అయితే ఈ ఎన్నికలు మరో ఎత్తుగా నిలిచాయి. గత లోక్ సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ తరుపున గోమాస శ్రీనివాస్ ప్రభావం చూపించినా, టీఆర్ ఎస్ సెంటిమెంట్ ముందు ఓటమి ముంగిట నిలిచారు. కానీ ఇప్పటి పరిస్థితులు మరోలా మారి, బీజేపీ లేపిన సెంటిమెంట్ తో గోమాస బయట పడే అవకాశం 90 శాతంగా ఉన్నాయి. అసలు బీజేపీ ప్రభావం లేదని, గ్రూప్ తాగదాలతో గెలవదు అనే స్థాయి నుండి అందరి చూపు పెద్దపల్లి పార్లమెంట్ పై దృష్టి సారించేలా చేశాయి. ఈసారి గెలిస్తే గోమాసకు మంత్రి పదవి ఖాయంగా చర్చలు జోరందుకున్నాయి. పెద్దపల్లి మరోసారి ఢిల్లీలో వార్తల్లోకి రానున్నదని రాజకీయ విశ్లేషకుల భావన. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీ ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా ఉన్నా, ఓటర్ల తీర్పును అందరు గౌరవించాల్సిందే.... కాగా మరో ఇరవై రోజుల్లో నాయకుల భవిష్యత్ తెలనున్నది.

## ఆర్టీసీ బస్సుపై దాడి,,,

హైదరాబాద్, మే 16అల్లరిమూకలు చెలరేగిపోయారు. సైడ్ ఇవ్వలేదంటూ ఆర్టీసీ బస్సుపై తమ ప్రతాపం చూపించారు. అడ్డొచ్చిన ప్రయాణికులను భయబ్రాంతులకు గురిచేశారు. ఒకరు కాదు ఇద్దరు కాదు? సుమారు 50 మంది యువకులు బస్సుని ఆపి అద్దాలు పగులగొట్టి హల్‌చల్ చేశారు. హైదరాబాద్ శివారు రాచులూర్ గేట్ వద్ద జరిగిందీ ఘటన. కల్వకుర్తి డిపో బస్సును బైక్‌పై వెళ్తున్న కొందరు యువకులు టార్గెట్ చేశారు. ఎంతసేపు హారన్ కొట్టినా సైడ్ ఇవ్వట్లేదంటూ బస్సుని వెంబడించి, ఆపి మరి బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. హారన్ కొడితే సైడ్ ఇవ్వడం తెలీదా అంటూ డ్రైవర్, కండక్టర్‌పై దాడికి యత్నించారు. అడ్డొచ్చిన ప్రయాణికులనూ ఇష్టం వచ్చినట్లు దూషించి, వారిని భయబ్రాంతులకు గురిచేశారు. బస్సుని ఆపడమే కాదు మరికొందరికి ఫోన్ చేసి రప్పించి నడిరోడ్డుపైనే హంగామా సృష్టించారు.అల్లరిమూకల దాడి ఘటనపై కేసు నమోదు చేశారు పోలీసులు. డ్రైవర్, కండక్టర్ ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డ్రైవర్, కండక్టర్ తమ ఫోన్‌లో తీసిన ఫోటోలు, బైక్ నంబర్ల ఆధారంగా యువకుల కోసం గాలిస్తున్నారు.హైదరాబాద్ శివారులో రాచలూరు గేట్ వద్ద కల్వకుర్తి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సుపై కొందరు దుండగులు బైక్‌లపై వచ్చి దాడి చేశారు. బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. అయితే దీనిపై టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఎక్స్ (ట్విట్టర్) లో స్పందించారు. ప్రజలను నిత్యం సురక్షితంగా గమ్యస్థానాలకు తీసుకెళ్తున్న తమ బస్సులపై కారణాలు లేకుండా దాడులు చేయడాన్ని టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఏమాత్రం సహించదని పేర్కొన్నారు. ఈ ఘటనపై రాచకొండ కమిషనరేట్ మహేశ్వరం పీఎస్‌లో ఆర్టీసీ అధికారులు ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. పోలీసులు దీనిపై విచారణ చేస్తున్నారని.. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. బస్సుల ప్రజల ఆస్తి అని.. వాటిని రక్షించుకోవాల్సింది కూడా ప్రజలేనని సజ్జనార్ అన్నారు. పోలీసుల సహకారంతో నిందితులపై హిస్టరీ షీట్స్ కూడా తెరుస్తామని.. బస్సు డ్యామేజీ ఖర్చులు వారి నుంచి వసూలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## సంక్షోభంలో మోదీకి చాలా సహాయం చేశా: శరద్ పవార్



ముంబై: ప్రధాని మోదీ తనపై చేసిన వ్యాఖ్యలను నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్ తిప్పికొట్టారు. సంక్షోభ సమయంలో మోదీకి తాను చాలా సహాయం చేసినట్లు చెప్పారు. ఇప్పుడు నరేంద్ర మోదీ ఏమిమాట్లాడినా తాను పట్టించుకోనని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శరద్ పవార్‌ను ప్రధాని మోదీ పరోక్షంగా విమర్శించారు. కేంద్ర వ్యవసాయ మంత్రిగా ఉన్నప్పుడు రైతుల కోసం ఆయన ఏమీ చేయలేదని ఆరోపించారు. అందుకే రైతులు కష్టాల్లో ఉన్నారని విమర్శించారు.కాగా, ప్రధాని మోదీ వ్యాఖ్యలపై శరద్ పవార్ గురువారం స్పందించారు. తాను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు (2004-2014) అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి, ఇప్పుడు ప్రధాని అయిన మోదీకి చాలా సహాయం చేశానని తెలిపారు. ‘ఆయన (మోదీ) వ్యవసాయ రంగం సమస్యలతో నా దగ్గరకు వచ్చేవారు. నన్ను గుజరాత్‌కు కూడా తీసుకెళ్లారు. ఒకసారి ఆయన ఇజ్రాయెల్‌ను సందర్శించాలనుకున్నారు. నేను ఆయనను కూడా అక్కడికి తీసుకెళ్లా. ఇప్పుడు నరేంద్ర మోదీ ఏమి చెప్పినా నేను పట్టించుకోను’ అని మీడియాతో అన్నారు.

## ఉత్తరాదిన తీవ్ర వడగాలులు : 45 డిగ్రీలకు చేరనున్న ఉష్ణోగ్రతలు



ఉత్తరాదిలో వడగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఢిల్లీ, పంజాబ్, హరియాణ, యూపీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో రాబోయే మూడు రోజుల్లో భానుడి భగభగలు కొనసాగుతాయని, ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది.దేశ రాజధానిలో శనివారం ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటుతుందని అంచనా వేసింది. గడిచిన 24 గంటల్లో ఒడిషాలోని నౌపడలో అత్యధికంగా 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. పంజాబ్, హరియాణ, యూపీ, తూర్పు రాజస్థాన్, బిహార్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వడగాలులు కొనసాగుతాయని ఐఎండీ పేర్కొంది.మే 18, మే 19న ఢిల్లీలో వడగాలులు తీవ్రంగా ఉంటాయని అంచనా వేసింది. ఈ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బకు గురికాకుండా అవసరమైన జాగ్రతలు తీసుకోవాలని సూచించింది

## మంథనిలో ఘనంగా జడ్పీ చైర్మన్ పుట్ట మధు జన్మదిన వేడుకలు

పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ జన్మదిన వేడుకలను అభిమానులు గురువారం తన నివాసమైన రాజగృహలో ఘనంగా నిర్వహించారు.మంథని ఎమ్మెల్యేగా పుట్ట పుట్ట మధుకర్ విజయం సాధించిన మే 16వ తేదీనే తన జన్మదినంగా జరుపుకుంటున్న సందర్భంగా పెద్దపెల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు తన అభిమానులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పుట్ట మధుకర్ శైలజ దంపతులను అభిమానులు గజమాలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు. జడ్పీ చైర్మన్ కు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అరేపల్లి కుమార్, కాయితి సమ్మయ్య, గర్రెపల్లి సత్యనారాయణ, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు యెగోళపు శంకర్ గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ మాచిడి రాజు గౌడ్, నాయకులు తగరం శంకర్ లాల్, బత్తుల సత్యనారాయణ, కనవేనా శ్రీనివాస్ యాదవ్, ఆసిఫ్ ఖాన్, ఇర్ఫాన్, తాటి సతీష్, పుప్పాల భాగ్యలక్ష్మి ,పద్మ , ఆడిచర్ల సమ్మయ్య తోపాటు అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ వ్యాప్తంగా రైతుల నిరసన

హైదరాబాద్, మే 16తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డెక్కాయి. నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలిపాయి. అన్ని జిల్లాలో రోడ్లపై బైటాయించి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన గళాన్ని వినిపిస్తున్నాయి. రైతుల ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. తడిచిన ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు క్వింటాల్ ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డెక్కాయి. నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలిపాయి. అన్ని జిల్లాలో రోడ్లపై బైటాయించి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన గళాన్ని వినిపిస్తున్నాయి. రైతుల ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. తడిచిన ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు క్వింటాల్ ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై రైతులు కూడా అక్కడక్కడా రోడుపై కూర్చొని నిరసన తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక చర్యలకు నిరసనగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు.ఈ మేరకు రాష్ట్రంలోని ఏర్పాటు చేసి ర్యాలీ చేపట్టారు. అకాల వర్షం కారణంగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద తీసుకొచ్చిన ధాన్యం తడిసిపోయిందని.. దీనికి కారణం అధికారులు కొనుగోలులో చేపట్టిన జాప్యమే అని చెబుతున్నారు.

# తొలి బంగారు గని...

కర్నూలు, మే 16 ,దేశంలోనే తొలి ప్రైవేటు బంగారు గని ఆంధ్రప్రదేశ్ లో సిద్ధమవుతోంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో బంగారు గనిని డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థ అభివృద్ధి చేస్తోంది. సుమారు 250 ఎకరాల భూసేకరణ చేపట్టి భూగర్భం నుంచి పసిడిని వెలికితీసేందుకు రూ. 200 కోట్ల పెట్టుబడితో భారీ ప్లాంట్ నిర్మిస్తోంది. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తవడంతో పైలట్ స్థాయిలో రోజుకు కిలో బంగారం ఉత్పత్తి చేస్తున్నట్లు సంస్థ ఎండీ హనుమ ప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది చివరికల్లా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలైతే ఏటా 750 కిలోల బంగారం ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారం గనిలో కొద్దిరోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే దానికి సంబంధించి ప్రాసెసింగ్ ప్లాంట్ పనులు దాదాపు 60 శాతం పూర్తి కావడంతో నాలుగైదు నెలల్లో ఉత్పత్తి మొదలు కానున్నట్లు దక్కన్ గోల్డ్ మైన్స్ వెల్లడించింది.దీనికోసం ఇప్పటికే 250 ఎకరాలకు పైగా భూమిని సేకరించడం, ప్లాంట్ పనులు చేపట్టింది. ఏటా 750 కిలోల బంగారు ఉత్పత్తి చేయాలన్నది ఆ కంపెనీ అంచనా. ఇప్పటివరకు ఈ బంగారు గనిపై దాదాపు కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టింది. ఏపీలోని చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కొన్ని పసిడి గనులను గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. వీటిని తవ్వేందుకు ప్రభుత్వ రంగం సంస్థ ఎన్ఎండీసీ ముందుకొచ్చింది. వీటిని తమకు అప్పగించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరింది కూడా.రాయలసీమలో బంగారం కోసం అన్వేషణ ఈనాటిది కాదు. బ్రిటీష్ పాలనకు ముందు మహమ్మదీయులు, శ్రీకృష్ణదేవరాయుల కాలంలో ఏపీలో మైనింగ్ జరిగినట్టు ఆధారాలు ఉన్నట్లు చెబుతున్నాయి. అపారమైన ఖనిజ నిక్షేపాలు బంగారం, వజ్ర సంపద ఉన్న ప్రాంతంలో అశోకుడు ఆయన అధికారులు విడిది చేశారని అంటున్నారు. ఇందుకు సాక్ష్యం జొన్నగిరి సమీపంలో అశోకుని శిలాశాసనాలు ఉదాహరణగా చెబుతున్నారు. మొత్తానికి రాయలసీమ పసిడికి ఉత్పత్తికి వేదిక కానుందన్నమాట.బంగారం గనుల కోసం దేశంలో విపరీతమైన పోటీ నెలకొంది. రాజస్థాన్‌లో రెండు గనుల కోసం వేదంతా గ్రూప్, హిందుస్థాన్ జింక్, జిందాల్ పవర్ ఇందులో ఉన్నాయి. కంక్రియా గారా గోల్డ్ బ్లాక్, భూకియా–జగ్ పూరా బ్లాక్‌లను అక్కడి ప్రభుత్వం ఇప్పటికే వేలం నిర్వహిస్తోంది.దక్కన్ గోల్డ్ మైన్స్ కంపెనీ విషయానికొస్తే.. దేశంలో వివిధ ప్రాంతాల్లో గనులు నిర్వహిస్తోంది. ఈ సంస్థ విదేశాల్లోనూ గనుల ప్రాజెక్టును చేపట్టింది. ముఖ్యంగా ఆఫ్రికా ఖండంలోని మొజాంబిక్‌లో లిథియమ్ గనులు కొనుగోలు చేసింది. దీన్ని అక్కడి మాగ్నిఫికా గ్రూప్‌తో కలిసి జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేసింది. అందులో దక్కన్ గోల్డ్ మైన్స్‌కు 51 శాతం ఉండగా, దాన్ని 75 శాతానికి పెంచుకునేలా ప్లాన్ చేస్తోంది.రాజస్థాన్ రాష్ట్రంలోని కంక్రియా గారా గోల్డ్ బ్లాక్, భూకియా–జగ్ పురా గ్లోడ్ బ్లాక్ లను ఆ రాష్ట్ర ప్రభుత్వ గనుల శాఖ వేలం వేస్తోంది. అలాగే దక్కన్ గోల్డ్ మైన్స్ మన దేశంలో వివిధ ప్రాంతాల్లో బంగారం గనులు నిర్వహిస్తోంది. తాజాగా ఆఫ్రికాలోని మొజాంబిక్ లో లిథియమ్ గనులు కొనుగోలు చేసింది. దీని కోసం మాగ్నిఫికా గ్రూప్ ఆఫ్ మొజాంబిక్ తో కలిసి దక్కన్ గోల్డ్ మొజాంబిక్ ఎల్‌డీఏ అనే జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేసింది. ఇందులో దక్కన్ గోల్డ్ మైన్స్ కు 51 శాతం వాటా ఉండగా.. దానిని 70 శాతానికి పెంచుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ గనుల్లో రోజుకు 100 టన్నుల లిథియమ్, టాంటలమ్, ఇతర ఖనిజాలను ప్రాసెస్ చేసే సామర్థ్యం గల ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది.

# కడపలో క్రాస్ ఓటింగ్

కడప, మే 16 ఏపీలో అత్యంత ఉత్కంఠం రేపిన నియోజకవర్గం కడప పార్లమెంట్ స్థానం. ఇక్కడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పిసిసి అధ్యక్షురాలు షర్మిల పోటీ చేశారు. వివేక హత్య కేసును హైలైట్ చేస్తూ.. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న అవినాష్ రెడ్డి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తుండడంతో.. షర్మిల నేరుగా రంగంలోకి దిగారు. అవినాష్ ను ఎలాగైనా ఓడించాలన్న కసితో పని చేశారు. అయితే జగన్ దెబ్బతీయాలని అటు చంద్రబాబు భావిస్తున్న తరుణంలో.. షర్మిల అన్న పై యుద్ధం ప్రకటించడంతో విపక్షాల నుంచి ఆమెకు ఆయాచిత లబ్ధి చేకూరినట్లు తెలుస్తోంది.ఒకవైపు షర్మిల రాజకీయ పోరాటం చేస్తుంటే.. మరోవైపు సునీత న్యాయ పోరాటం చేస్తూ ముందుకు సాగారు. షర్మిలకు అండగా సునీతతో పాటు ఆమె తల్లి సౌభాగ్యమ్మ ప్రచారం చేశారు. జగన్ తల్లి విజయమ్మ షర్మిల కు మద్దతుగా ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. షర్మిల కు మద్దతు తెలపాలని కడప జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ నేపథ్యంలో షర్మిల కడప జిల్లాలో చేసిన ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైయస్ బిడ్డగా అడుగుతున్నా న్యాయం చేయండి.. కొంగు చాచి అడుగుతున్నా న్యాయం చేయండి అంటూ షర్మిల అడిగేసరికి కడప జిల్లా ప్రజల్లో ఒక రకమైన చేంజ్ కనిపించింది. ముఖ్యంగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. అటు జగన్ పై అభిమానం ఉన్నవారు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి ఓటు వేస్తే.. ఎంపీ విషయానికి వచ్చేసరికి షర్మిలకు ఓటు వేసినట్లు తెలుస్తోంది. పోలింగ్ సరళి కూడా దానినే తెలియజేస్తోంది.ఇక్కడ టిడిపి అభ్యర్థిగా భూపేష్ రెడ్డి ఉన్నారు. ఇక్కడ టిడిపికి నిర్దిష్టమైన ఓటు బ్యాంకు ఉంది. కానీ జగన్ ను దెబ్బతీయాలంటే షర్మిలకు సపోర్ట్ చేయడమే మేలన్న నిర్ణయానికి టిడిపి వచ్చినట్లు సమాచారం. ఎంపీ కి మాత్రం షర్మిలకు వేసి, ఎమ్మెల్యేల విషయానికి వచ్చేసరికి మాత్రం కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలని టిడిపి నాయకత్వం అంతర్గతంగా క్యాడర్కు మార్గదర్శకం చేసినట్లు సమాచారం.వైసీపీలో చీలిక వచ్చి, టిడిపి ఓటు బ్యాంకు తోడైతే.. షర్మిల కచ్చితంగా గెలిచే ఛాన్స్ ఉందని టాక్ నడుస్తోంది. మరి అది ఎంతవరకు సాధ్యమవుతుందో చూడాలి.

# ఏపీలోని మూడు స్పెషల్ జలపాతాలు

విజయవాడ, మే 16 బిజీ బిజీ లైఫ్, వర్క్ టెన్షన్స్ నుంచి ఉపశమనం కోరుకుంటున్నారా? అయితే అద్భుతమైన కొండలలో, ఆకాశం నుంచి నీరు జారిపడుతుందా? అనే అనుభూతిని కలిగించే జలపాతాలను ఒకసారి చూసేయండి. ఏపీలోని మూడు స్పెషల్ జలపాతాల గురించి తెలుసుకుందాం. అవే కటికి, తలకోన, పెంచలకోన జలపాతాలు. చుట్టూ కొండలు, ప్రశాంతమైన వాతావరణం, సుందరమైన జలపాతాలు, భూలోకస్వర్గం ఇదే అనిపిస్తుంది.కటికి జలపాతం అల్లూరి సీతారామ రాజు జిల్లాలో ఉంది. బొర్రా గుహల నుంచి 7 కిలోమీటర్ల ప్రయాణ దూరంలో కటిక జలపాతం ఉంది. గోస్తని నది ఉద్భవంలో భాగంగా కటికి జలపాతం ఉంది. రిఫ్రెష్ ఎస్కేప్ కోసం కటికి జలపాతం సుందరమైన ప్రదేశం. బొర్రా గుహల నుంచి 7 కి.మీ దూరంలో, అరకు నుంచి 39 కి.మీ, వైజాగ్ నుంచి 90 కి.మీ, హైదరాబాద్ నుంచి 665 కి.మీ దూరంలో కటికి జలపాతం ఉంది. అరకు బొర్రా గుహల సమీపంలో ఉన్న అద్భుతమైన జలపాతం ఇది. సమీపంలోని గ్రామం పేరు ఆధారంగా ఈ జలపాతానికి కటికి అని పేరు వచ్చింది. కటికి జలపాతం గోస్తని నది ద్వారా ఏర్పడింది. సుమారు 100 అడుగుల ఎత్తు నుంచి నీరు జారిపడుతుంది. ఈ జలపాతం దిగువన ఉన్న చెరువు స్నానం చేయడానికి అద్భుతమైన ప్రదేశం. దట్టమైన అడవిలో 20-30 నిమిషాల ట్రెక్కింక్ చేసి ఈ జలపాతాన్ని చేరుకోవాలి. సమీపంలోని రహదారి ద్వారా పర్వత శిఖరానికి చేరుకోవచ్చు. ఇక్కడ వంట, క్యాంపింగ్ అనుమతిస్తారు. ట్రెక్కింగ్‌కు కూడా ఇది బెస్ట్ ప్లేస్.అరకు నుంచి కటికి చేరుకునేందుకు... అనంతగిరి తర్వాత 30 కి.మీల దూరం ప్రయాణించారు. ముల్యగూడ జంక్షన్ వద్ద బొర్రా గుహల రహదారిలో ప్రయాణించి అదే రోడ్డులో బొర్రా గుహల రైల్వే క్రాసింగ్‌ను దాటండి. రైల్వే క్రాసింగ్ నుంచి దాదాపు 2 కి.మీ ప్రయాణించి ఎడమ మలుపు తీసుకోవాలి. అక్కడ నుంచి నేరుగా బొర్రా గుహలకు వెళ్లాలి. అదే దారిలో 300 మీటర్లు దాటిన తర్వాత ఎడమవైపు మలుపు తిరిగి, దాదాపు 4-5 కి.మీ రహదారి టన్నెల్ ఉంటుంది. ఇది రైల్వే ట్రాక్ వద్ద ముగుస్తుంది. ఇక్కడి నుంచి రైల్వే ట్రాక్ దాటి నేరుగా పర్వతంపై ట్రెక్కింగ్ చేయాలి. ఇక్కడి నుంచి జలపాతం దాదాపు 20-30 నిమిషాల ట్రెక్కింగ్‌లో ఉంటుంది. ఈ మార్గం ఇరుకైనది, జారే విధంగా ఉంటుంది. అయితే జీపులు మాత్రం అందుబాటులో ఉన్నాయి. పర్యాటకులు జీపుల్లో వెళ్లవచ్చు. అయితే ఈ ప్రదేశానికి ప్రజా రవాణా అందుబాటులో ఉండదు. సందర్శకులు తమ సొంత కారులో జలపాతం వద్దకు వెళ్లకూడదు. రహదారి ఎగుడుదిగుడుగా ఉండడం వల్ల సాధారణ కార్లలో ప్రయాణానికి అనుకూలంగా ఉండదు. జలపాతం వద్ద బ్యాంబు చికెన్‌ను విక్రయిస్తారు. అడవి తేనె కూడా లభిస్తుంది. ఈ జలపాతాన్ని చూసేందుకు ఆగస్టు నుంచి డిసెంబర్ ఉత్తమ సమయం. వేసవిలో ఈ ప్రాంతం పొడిగా ఉంటుంది.తలకోన జలపాతం తిరుపతి జిల్లా యెర్రావారిపాలెం మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం. చుట్టూ ఎత్తైన కొండలతో, దట్టమైన అరణ్యప్రాంతం మధ్యలో ఈ జలపాతం ఉంటుంది. ఇక్కడ నిత్యం పర్యాటకుల రద్దీ ఉంటుంది. తిరుపతికి దాదాపు 45 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ జలపాతం ప్రకృతి రమణీయ ప్రదేశాల్లో ఒకటి. తిరుపతికి 45 కి.మీ దూరంలో శేషాచల కొండల మధ్యలో ఈ జలపాతం ఉంది. 82 మీటర్ల ఎత్తు నుంచి పడుతున్న జలపాతాలు చాలా అకర్షణీయంగా ఉంటాయినెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచలకోన ఒక ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం. నెల్లూరు నుంచి 80 కిలోమీటర్ల దూరంలో పెంచలకోన జలపాతం ఉంది. ఇది పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం నుంచి 2 కి.మీ దూరం ఉంది. కండలేరు నది పెంచలకోన వద్దే పుట్టింది.

# తిరుపతిలో గంగమ్మ జాతర... సందడి



తిరుపతి, మే 16, మొన్నటి వరకూ ఎన్నికల ప్రచారాలతో హోరెత్తిన తిరుపతి నగర విధులు.. ఇవాళ్టి నుంచి ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. రాష్ట్రంలో జరిగే ప్రముఖ జాతరల్లో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు ఎంతో విశిష్టత ఉంది. ప్రతీ ఏటా మే నెలలో ఏడు రోజుల పాటు జాతర నిర్వహించటం జరుగుతుంది. నిన్న అర్ధరాత్రి చాటింపుతో తిరుపతి గ్రామ దేవతగా పిలుచుకొనే చిన్నగంగమ్మ జాతర గ్రాండ్‌గా ప్రారంభమైంది. 21వ తేదీ వరకు ఏడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. 22వ తేదీన తెల్లవారు జామున అమ్మవారి విశ్వరూప దర్శనం, చెంప నరికే కార్యక్రమంతో జాతర ముగియనుంది. ఏడు రోజుల పాటు వివిధ వేషాలలో గంగమ్మను భక్తులు దర్శించుకోనున్నారు. సంప్రదాయం ప్రకారం కైకాల వంశస్తులు తిరుపతి గంగజాతర సందర్భంగా అర్ధరాత్రి గ్రామంలో చాటింపు పూజ నిర్వహించి నగర శివారు ప్రాంతాలలో అష్టదిగ్బంధనం చేసి చాటింపుతో జాతరకు శ్రీకారం చుట్టారు. జాతర ప్రారంభం కావడంతో అమ్మవారి అనుగ్రహం పొందేందుకు పూజలు నిర్వహిస్తారు. ఇవాళ బైరాగివేషంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. రేపు బండ వేషం, 17న తోటి వేషం, 18న దొర వేషం, 19న మాతంగి వేషం, 20న సున్నపు కుండలు, 21న గంగమ్మకు చప్పరం కార్యక్రమం నిర్వహిస్తారు. ఇక 22న విశ్వరూప దర్శనం తర్వాత చెంప నరికే కార్యక్రమంతో జాతర ముగుస్తుంది.అలాగే తిరుపతి గ్రామ దేవత గంగమ్మ జాతరలో మరో విశేషం ఉంది. జాతర జరిగినన్ని రోజులు గ్రామస్తులు ఊరి విడిచి వెళ్లరు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా రాత్రుళ్లు బస చేయకుండా వెళ్లిపోవడం ఇక్కడి ఆచారం. తాతయ్యగుంట గంగమ్మ జాతరకు 900 ఏళ్ల చరిత్ర ఉంది.

# గోదావరి జిల్లాల్లో వర్కౌటైనట్టేనా

కాకినాడ, మే 16, పార్టీ అధికారంలోకి రావాలన్నా ఉభయ గోదావరి జిల్లాల్లో ఎవరికి ఎక్కువ స్థానాలు వస్తే వారికే అధికారం వస్తుంది. కొన్ని దఫాల నుంచి ఇదే జరుగుతుంది. అందుకే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పట్టు కోసం అన్ని పార్టీలూ ప్రయత్నిస్తాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో మొత్తం 34 స్థానాలున్నాయి. అయితే ఇందులో అత్యధికంగా స్థానాలను గెలుచుకోవాలని టీడీపీ? తొలి నుంచి ఒక ప్లాన్ ప్రకారం వెళ్లింది. గత ఎన్నికల్లో జరిగిన ఓటమి ఈసారి జరగకూడదని భావించి అక్కడ ప్రధాన సామాజికవర్గమైన కాపులను తమ వైపునకు తిప్పుకునేందుకు జనసేన పార్టీని అక్కున చేర్చుకుంది. ఎలక్షనీరింగ్ సక్రమంగా చేయడం కోసం బీజేపీని కౌగిలించుకుంది. తూర్పు గోదావరి జిల్లాలో జనసేనతో పొత్తుతో 19 స్థానాల్లో కనీసం పదిహేను స్థానాలను సాధించాలని భావించింది. అందుకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేసింది. కూటమిలో ఉన్న మిత్రపక్ష పార్టీలకు అక్కడ పార్లమెంటు స్థానంతో పాటుగా శాసనసభ స్థానాలను ఇచ్చింది. కేవలం అత్యధిక స్థానాలను గెలుచుకోవడం కోసం తూర్పు గోదావరి జిల్లాలో పట్టు సాధించేందుకు టీడీపీ ప్రయత్నించింది. అయితే టీడీపీ ఊహించిన స్థాయిలో ఓట్ల బదిలీ అనేది జరగలేదన్న సమాచారం టీడీపీ నేతలకు ఊపిరి సలవనివ్వడం లేదు. ముఖ్యమైన స్థానాల్లోనూ వైసీపీ చివరి నిమిషంలో పోటీ కి దూసుకు రావడంతో అభ్యర్థుల గెలుపోటములపై ఇప్పుడు తెలుగు తమ్ముళ్లలో దిగులు పట్టుకుందిప్రధానంగా రెండు జిల్లాల్లో జగన్ చేసిన సోషల్ ఇంజినీరింగ్ మంచి ఫలితాలు వచ్చాయంటున్నారు. ప్రధానంగా శెట్టి బలిజలకు రెండు పార్లమెంటు స్థానాలు కేటాయించడంతో పాటు శెట్టి బలిజలకు అసెంబ్లీ స్థానాలు అధికంగా ఇవ్వడం, అలాగే టీడీపీ కంటే కాపులకు అత్యధికంగా ఎమ్మెల్యే స్థానాలను కేటాయించడంతో కొంత ఓట్లను టీడీపీ కోల్పోవాల్సి వచ్చిందన్నారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలోనూ టీడీపీ అంచనాలు అనుకున్న స్థాయిలో వర్క్ అవుట్ కాలేదంటున్నారు. ముఖ్యంగా టీడీపీ మిత్రపక్షాలైన బీజేపీ, జనసేన పోటీ చేసిన స్థానాల్లో టీడీపీ నుంచి ఓట్లు బదిలీ కాలేదని చెబుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పదిహేను స్థానాలకు పన్నెండు సాధించాలనుకున్న టీడీపీకి ప్లాన్ ఎలక్షనీరింగ్ లో ఫెయిలందన్న వార్తలు కొంత నిరాశను కలిగిస్తున్నాయి.

# ఫైర్ బ్రాండ్ల ఫ్యూచర్ ఏంటీ

విజయవాడ, మే 16 వైసీపీ ఫైర్ బ్రాండ్ల పరిస్థితి ఏమిటి? ఎన్నికల్లో గెలుపు పొందుతారా? ఓటమి చవిచూస్తారా? ఒకవేళ ఓడిపోతే వారి పరిస్థితి ఏంటి? ఇప్పుడు ఏపీలో ఇదో ఆసక్తికర రాజకీయ పరిణామంగా మారింది. ఎక్కడ చూసినా వారిపైనే చర్చ జరుగుతోంది. ఎక్కువమంది ఆరా తీయడం కనిపిస్తోంది. మంత్రులు ఆర్కే రోజా, అంబటి రాంబాబు, గుడివాడ అమర్నాథ్, మాజీ మంత్రులు కొడాలి నాని, అనిల్ కుమార్ యాదవ్ లు వైసీపీలో ఫైర్ బ్రాండ్లుగా ముద్రపడ్డారు. అధినేత పై ఈగ వాలనిచ్చేవారు కాదు. రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత కామెంట్లకు దిగేవారు. గత ఐదేళ్లుగా అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచేవారు. అందుకే వారి పరిస్థితి ఎలా ఉందో అని ఎక్కువమంది ఆరా తీస్తున్నారు.మంత్రి రోజా నగిరి నుంచి హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తున్నారు. కానీ వాస్తవం ప్రతికూలంగా ఉంది ఆమెకు. పోలింగ్ నాడే ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. తెలుగుదేశం పార్టీతో తనకు ఇబ్బంది లేకుండా.. సొంత పార్టీ వారే తనను ఓడించడానికి సిద్ధపడ్డారని చెప్పడం ద్వారా.. ముందుగానే ఓటమిని అంగీకరించారు ఆమె. అక్కడ రోజాకు టికెట్ ఇవ్వద్దని వైసీపీకి చెందిన నేతలే హై కమాండ్ కు కోరారు. కానీ జగన్ అవేవీ పట్టించుకోలేదు. రోజా కి టికెట్ ఇచ్చారు. కానీ అసమ్మతి నాయకులను రోజా కలుపుకొని వెళ్లలేదు. ప్రచారానికి కూడా పిలవలేదు. తీరా ఇప్పుడు పోలింగ్ ముగిశాక వారు సహకరించలేదని చెప్పడం ద్వారా రోజా ఓటమిని అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది.కొడాలి నాని 2004 నుంచి గుడివాడలో గెలుపొందుతూ వస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపొంది రికార్డ్ సృష్టించాలని భావిస్తున్నారు. కానీ ఈసారి అంత ఈజీ కాదని తెలుస్తోంది. ఇక్కడ తెలుగుదేశం పార్టీ పట్టు బిగించింది. బలమైన అభ్యర్థిని బరిలో దించింది. ప్రభుత్వంపై వ్యతిరేకత మరోవైపు, కొడాలి నాని ఓడించాలని టిడిపి కలిసి ఇంకోవైపు గట్టిగానే ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. అత్తెసరు మెజారిటీతో మాత్రమే నాని గెలిచే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఒకవేళ ప్రభుత్వంపై వ్యతిరేకత తీవ్రంగా ప్రభావం చూపితే ఓటమి కూడా ఎదురయ్యే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.మంత్రి అంబటి రాంబాబు పరిస్థితి కూడా ఏమంత ఆశాజనకంగా లేదు. ఆయన సత్తెనపల్లి నుంచి రెండోసారి పోటీ చేస్తున్నారు. కానీ ఈసీ అంతగా పని చేయడం లేదని.. టిడిపికి అనుకూలంగా పనిచేసినట్లు మీడియా ముందుకు వచ్చి ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అక్కడ ఓటమి తప్పదని సంకేతాలు ఉన్నాయి. పోలింగ్ సరళి కూడా మారడంతో అంబటిలో ఆందోళన ప్రారంభమైంది. అందుకే ఓటమికి కుంటి సాకులు వెతుక్కుంటున్నారని టిడిపి చెబుతోంది.గుడివాడ అమర్నాథ్ పరిస్థితి కూడా అలానే ఉంది. గత ఎన్నికల్లో అనకాపల్లి అసెంబ్లీ స్థానం నుంచి గెలిచిన అమర్నాథ్కు విస్తరణలో జగన్ మంత్రి పదవి ఇచ్చారు. కానీ గ్రాఫ్ బాగాలేదని చెప్పి అనకాపల్లి నుంచి గాజువాక కు మార్చారు. అయితే అక్కడ టిడిపి అభ్యర్థి పల్లా శ్రీనివాస్ బలంగా ఉన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ఒకవైపు, వైసీపీలో గ్రూపులు మరోవైపు కలవర పెడుతున్నాయి. అమర్నాథ్ ఎదురీదుతున్నట్లు తెలుస్తోంది.మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే గా ఉన్న ఆయన గ్రాఫ్ తగ్గిందని.. నరసరావుపేట ఎంపీ స్థానం నుంచి జగన్ పోటీ చేయించారు. అయితే అక్కడ కూడా ఏమంత పరిస్థితి బాగా లేదన్నట్లు తెలుస్తోంది. లావు శ్రీకృష్ణదేవరాయలు చేతిలో అనిల్ కు ఓటమి తప్పదని సంకేతాలు వస్తున్నాయి. అటు పోలింగ్ తర్వాత అనిల్ చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాలకు బలం చేకూర్చాయి. వారు ఏపీ పోలీసులా? టిడిపి కార్యకర్తలా? అని ప్రశ్నించడం ద్వారా ఓటమి భయాన్ని బయట పెట్టుకున్నారు జగన్.ఇక అత్యంత వివాదాస్పదులుగా ఉన్న ఫైర్ బ్రాండ్ల జాబితాలో దేవినేని అవినాష్, వల్లభనేని వంశీ మోహన్, సిదిరి అప్పలరాజు వంటి వారు సైతం ఓటమి బాటలో ఉన్నట్లు సమాచారం.

# నేతల్లో క్రాస్ ఓటింగ్ భయం

విజయవాడ, మే 16, ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు ముగిశాయి. నేతల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. అయితే ఫలితాలు రావడానికి ఇంకా సమయం ఉంది. అయితే కొన్ని నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ జరిగిందన్న ఫీడ్ బ్యాక్ తో నేతల కంటి మీద కునుకు లేకుండా పోయింది. అసెంబ్లీకి ఒక గుర్తుపైన ఓటు వేసిన వారు పార్లమెంటుకు వచ్చేసరికి మరో గుర్తుపై వేశారంటున్నారు. పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన ఏజెంట్లు, ముఖ్య కార్యకర్తల నుంచి వచ్చిన సమాచారంతో క్రాస్ ఓటింగ్ పెద్దయెత్తున జరిగిందని చెబుతున్నారు. ముఖ్యంగా తూర్పు గోదావరి జిల్లాలోని పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో పెద్దయెత్తున క్రాస్ ఓటింగ్ జరిగినట్లు ప్రచారం జరుగుతుంది. తూర్పు గోదావరి జిల్లాలో కూటమి తరుపున మూడు పార్టీల అభ్యర్థులు బరిలోకి దిగారు. మూడు గుర్తులు ఓటర్లకు చెప్పడానికి నేతలు కొంత కష్టపడాల్సి వచ్చింది. ఇంటింటి ప్రచారంలోనూ ఎవరికి వారే తమ గుర్తును ప్రచారం చేసుకుని వెళ్లారు. మూడు గుర్తులు చెబితే ఓటర్లు కన్ఫ్యూజన్ కు గురవుతారని భావించి మూడు పార్టీలూ కూడా ఒక గుర్తు ను మాత్రమే ప్రచారం చేసి వెళ్లారు. అయితే కొన్ని చోట్ల రెండు గుర్తులకు ఓటు వేయాల్సి వచ్చింది. ఇది ఇబ్బందిగా మారింది. కాకినాడ పార్లమెంటుకు జనసేన అభ్యర్థి పోటీ చేయగా, రాజమండ్రి పార్లమెంటు నుంచి బీజేపీ అభ్యర్థి పోటీ చేశారు. అంటే ఈ పార్లమెంటు పరిధిలోని శాసనసభ నియోజవర్గాలు రెండు గుర్తులను గుర్తుపెట్టుకుని మరీ ఓటువేయాల్సిన పరిస్థితి ఉంది. అందుకే ఎన్నికల తర్వాత నేతలు జరుపుతున్న విశ్లేషణలలో ఇవన్నీ బయటపడుతున్నాయి. ఓటర్లు తాము ఆ గుర్తుకు వేయలేదని చెబుతుండటంతో క్రాస్ ఓటింగ్ జరిగిందని భావిస్తున్నారు. కాకినాడ పార్లమెంటు పరిధిలో వైసీపీ నుంచి పోటీ చేసిన చలమలశెట్టి సునీల్ మూడు సార్లు వివిధ పార్టీల నుంచి ఓటమి పాలయి కొంత సానుభూతిని కూడగట్టుకున్నారంటున్నారు. ఆయన అనేక మందికి ఉపాధి కూడా తన సంస్థల్లో కల్పించడంతో పాటు ప్రత్యర్థి కొత్తవాడు కావడంతో జనం అటు వైపు మొగ్గు చూపారంటున్నారు.

# ఓటింగ్ లో నారీ భేరి

తిరుపతి, మే 16, ప్రభుత్వ పథకాల్లో మహిళలకు పెద్ద పీట వేసిన వైసీపీ వారి నుంచి పూర్తి సహకారం అందుతుందన్న ఆశల్లో ఉంది. దీనికి తోడు మహిళల ఓట్లు పురుషుల కంటే ఎక్కువగా పోల్ కావడంతో కడప జిల్లాలో గెలుపు తమదే అన్న ఆశల్లో ఉంది. మహిళలు ఓటింగ్ శాతం అధికంగా ఉండడంతో ఎన్నికల తీర్పులో వారి తీర్పే కీలకంగా మారింది. అంచనాలతో వైసీపీ సాలిడ్‌గా ఉన్న రెండు మూడు నియోజకవర్గాల్లో తప్ప మిగతా చోట్ల ఓటింగ్ సరళి ఎవరికీ అంతుచిక్కని పరిస్థితి ఏర్పడింది.ఎన్నికల్లో మహిళల పోలింగ్ శాతం ఎక్కువగా ఉండటం, వీరితోపాటు సంపన్న వర్గాల కంటే పేద వర్గాల ఓట్లు ఎక్కువగా పోలుకావడం లాంటి పరిస్థితులు చూస్తే జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు పనిచేశాయా? ఆ పథకాలు పొందిన వారు ఆయనకు అనుకూలంగా ఓటు వేసే క్రమంలోనే ఓటింగ్ శాతం ఇంతగా పెరిగిందా? అన్న అభిప్రాయాలు ఒకవైపు ఉన్నాయి. అదే తరుణంలో ప్రభుత్వ వ్యతిరేకతతో పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారని టీడీపీ వర్గీయులు చెప్పుకొస్తున్నారు .అయితే ఇక్కడ ఉద్యోగ వర్గాలు, పార్టీ అంచనాలు ఏ మేరకు నిజమవుతాయన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి .మొదటి నుంచి జరుగుతున్న ప్రచారం ప్రకారం సంక్షేమ పథకాలు ఎక్కువగా మహిళలకు అందడం, పేద కుటుంబాలకు చేరడంతో ఆ ఓటింగ్ సరళి వైసీపీకి అనుకూలంగా ఉంటుందని భావిస్తూ వచ్చారు.

## రామతీర్థం. యర్రగుంట్ల గ్రామాల్లో తనిఖీలు చేసిన డీ హెచ్ ఎం ఓ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 16-నంద్యాల జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ . వెంకటరమణ గురువారం పలుకూరు ప్రాథమికఆరోగ్యకేంద్ర పరిధిలోని రామతీర్థం గ్రామము. మరియు బండిఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామాల్లో ప్రబలిన వాంతులు మరియు విరేచనాల రోగులను తనిఖీ చేశారు. వాంతులు మరుయు విరేచనాలతో బాధపడుచున్నటువంటి రోగములను పరామర్శించారు. వాంతులు మరియు విరేచనాలు రావడానికి గల కారణాలు మరియు తీసుకుంటున్నచర్యలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు చికిత్స అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినచోకఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వైద్యులకు మరియు వైద్య ఆరోగ్య సిబ్బందిని హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు క్లోరినేషన్ చేసినటువంటి సురక్షితమైన నీటిసరఫరా మరియు కాచిచల్లార్చిన నీటిని త్రాగవలేనని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తి గత పరిశుభ్రత గురించి అవగాహనకలిగించవలెనని మరియు వాంతులు మరియు విరేచనాల కేసులు జీరో అయ్యే వరకు గ్రామములో ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.

## పారిశుధ్య పనులపై తనిఖీలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 16- పట్టణంలో పలు వీధుల్లో పారిశుధ్య పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తనిఖీలు నిర్వహించారు .అక్కడ జరుగు తున్న శానిటేషన్ పనులను డ్రైనేజీ పనులనుపరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాలువల్లో వ్యర్థాలు చెత్త చెదారం ం వల్ల మురికి కాలువలు నిండి పోతున్నాయని ఆయన అన్నారు. ప్రజలు చెత్త చెదారం కాల్వల్లో వేయడం మానుకోవాలని సూచించారు. వేసిన వారికి నోటీసులు జారీ చేయాలని సిబ్బంది కి సూచించారు. అనంతరం నీటి శుద్ధి కేంద్రాలను పరిశీలించారు . కమిషనర్ వెంట . అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి . సచివాలయ సిబ్బంది. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 16- నకిలీ విత్తనాలు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి డి. రాజశేఖర్ షాపుల యజమానులను హెచ్చరించారు. పట్టణంలో గురువారం సాయి అగ్రో ఏజెన్సీ. శ్రీ వెంకటేశ్వర సీడ్స్ విత్తన దుకాణాలను తనిఖీ చేశారు.తనిఖీలో భాగంగా స్టాక్ రిజిష్టర్, బిల్ బుక్స్ తనిఖీ చేయడం అదేవిధంగా స్టాక్ బుక్ బ్యాలెన్స్ మరియు గ్రౌండ్ బ్యాలెన్స్ కరెక్ట్ ఉన్నాయా లేవా అని పరిశీలించారు. విత్తన నాణ్యత ప్రమాణాలను తెల్సుకోవడానికి సాయి ఆగ్రో ఏజెన్సీస్ దుకాణం శ్రీ వెంకటేశ్వర దుకాణాల నుంచి విత్తనాలను ల్యాబ్ కు పంపారు .ఈ సందర్భంగా ఎడీఎ రాజశేఖర్ మాట్లాడుతూ అనుమతి ఉన్న విత్తనాలు మాత్రమే విక్రయించాలని,సరైన దృవ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. లేనిచో విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ప్రసాద రావు. సిబ్బంది పాల్గొన్నారు.




# కౌంటింగ్ ఏర్పాట్లకు సిద్ధం చేసుకోండి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 16-పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అవసరమైన ఏర్పాటు సిద్ధం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు రిటర్నింగ్ అధికారులు, సంబంధిత నోడల్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్లోని ఆయన ఛాంబర్ లో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చేనెల 4వ తేదీన ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజీలలో నిర్వహించే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అవసరమైన ఏర్పాటు సిద్ధం చేసుకోవాలని రిటర్నింగ్, సంబంధిత నోడల్ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు కౌంటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ప్రతీ కౌంటింగ్ టేబుల్ వద్ద సూపర్ వైజర్, అసిస్టెంట్ సూపర్ వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉండాలని. ఇందుకు సంబంధించి 760 మంది సిబ్బంది అవసరం అవుతారని ఆ మేరకు సిబ్బందిని సిద్ధం చేయాలని మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. క్యూఆర్ కోడ్ రీడర్, పిజియోన్ హోల్, డ్రమ్స్, వివి ప్యాడ్ పిజియోన్ హోల్ తదితర స్టేషనరీ సామాగ్రిని సమకూర్చాలని మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు మెటీరియల్ ను సిద్ధం చేసుకోవాలని ట్రైనింగ్ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పూర్తయిన తరువాతనే ఈవీఎంల లెక్కింపు ప్రారంభించాలన్నారు. అన్ని పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని. ఆ మేరకు ఏర్పాటు సిద్ధం చేసుకోవాలనిరిటర్నింగ్ అధికారులను సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ పద్మజా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సంబంధిత నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అడల్ట్ బి సి జి టీకా కార్యక్రమం ప్రారంభం...




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :-డోన్ పట్టణంలోని 13 వైయస్ నగర్ సచివాలయం నందు అడల్ట్ బీసీజీ టీకా కార్యక్రమాన్ని డాక్టర్ షాబాజ్ హుస్సేన్ మరియు టీబీ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్స్ అరుణ్ కుమార్, కరీముల్లా ఆధ్వర్యంలో లాంఛనంగా గురువారం ప్రారంభించారు. బి సి జి వ్యాక్సిన్ తీసుకోవడం వలన భవిష్యత్తులో టీబీ వ్యాధి నివారణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బీసీజీ టీకా కార్యక్రమాన్ని నేటి నుంచి ప్రతి గురువారం అన్ని సచివాలయంలో అర్హులైన వారికి అందరికీ టీకాలు వేయుటకు ఏర్పాట్లు చేయడమైనది. ప్రతి ఏఎన్ఎం లక్ష్యసాధన కొరకు దిశా నిర్దేశాన్ని ఇవ్వడం అయినది. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం. హెలీనా రాణి, మార్గరేట్, సచివాలయ అడ్మిన్ రాజ్ కుమార్, శ్యామల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ వ్యాక్సిన్ పొందుటకు అర్హులైన ఆరు వర్గాల సమూహాల వర్గీకరణ తెలపడం అయినది.వారు ఎవరనగా6 క్రిటీరియవ్యాక్సిన్ వెయ్యవలసిన వాళ్ళు 1.లాస్ట్ 5 ఇయర్స్ లో టిబి వచ్చి తగ్గిపోయిన వాళ్ళు.2.18 ఏండ్లు నిండిన వాళ్ళు.3. స్మోకింగ్ పొగ తాగేవారు.4. షుగర్ వ్యాది ఉన్న వాళ్ళు.5. బిఎంఐ 18 కన్నా తక్కువ వుండేవాలు.6. టీబీ పేషంట్స్ క్లోజ్ కాంటాక్ట్స్.బీసీజీ వ్యాక్సిన్ పొందుటకు అర్హత లేనివారు. టీబీ వ్యాక్సిన్ వెయ్యకుడని వాళ్ళు 1. ఇప్పుడు టిబి వ్యాధి వుండి టిబి మందులు వాడుతున్న వాళ్ళు.2. గర్భవతి మరియు పాలు ఇచ్చే తల్లులు.3. హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు 4. టీబీ ప్రెవేంటివ్ ట్రీట్మెంట్ వాడు తున్న వాళ్ళు.5. వ్యాక్సిన్ రోజూ జ్వరము జలుబు దగ్గు , ఉన్న వాళ్ళు.6. వ్యాక్సిన్ వేసినపుడు రియాక్షన్స్ వచ్చిన వాళ్ళు.7. కిడ్నీ ఆర్ లివర్ ట్రాన్స్ ప్లాంట్ చేస్కొని మందులు వాడుతున్న వాళ్ళు.8. బ్లడ్ డొనేషన్ చేసిన 3 నెలలు వరకు అనర్హులు9. 18 ఏండ్లు దాటని వాళ్ళు.

## రైతులు సహకరించాలి...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- మే 16 శుక్రవారం17-05 -24 డోన్ బేతంచెర్ల నేషనల్ హైవే పనులు జరుగు తున్నందున 33 కెవి మల్కాపురం ఫీడర్ 33 కెవి లైన్ షిఫ్టింగ్ కారణంగా మల్కాపురం మరియు రంగాపు రం సబ్ స్టేషన్ ల పరిధిలోని గ్రామాలకు మరియు ఫ్యాక్టరీల కు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కరెంటు ఉండదని అలాగే డోన్ ఇండస్ట్రియల్ సబ్ స్టేషన్ నందు 11 కెవి కనపకుంట ఫీడర్ 11కె.వి లైన్ షిఫ్టింగ్ కారణంగా రైతులకు ఇచ్చే త్రీ ఫేస్ కరెంటు ఉదయం 6గంటల నుంచి 1గంటల వరకు ఉంటుందని ఏ. ఈ నాగేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. రైతులు సహకరించవలసిందిగా ఆయన కోరారు

# డెంగ్యూ వ్యాధి లక్షణాలు గురించి అవగాహన తెలిపిన డాక్టర్ అరుణ్

### మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు..



పత్తికొండ:మే.17. జాతీయ దినోత్సవం సందర్భంగా పత్తికొండ పట్టణంలో డాక్టర్ అరుణ్ డాక్టర్ సుజాత డాక్టర్ కార్తీక్ మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యాధి లక్షణాల గురించి పత్తికొండ పట్టణంలో బ్యానర్లతో ర్యాలీగా బయలుదేరుతూ పత్తికొండ ప్రజలకు అవగాహన కల్పిస్తూ డెంగ్యూ వ్యాధి గురించి శ్లోకన్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ డెంగ్యూ గురించి మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్మో వైరస్ తరగతికి చెందిన నాలుగు రకాల వైరస్ల వల్ల ఈ వ్యాధి వస్తుంది అది మనిషి నుండి మనిషికి వైరస్ ఈజిప్ట్ దోమల ద్వారా సక్రమిస్తుంది ఆడ లేడీస్ ఈజిప్ట్ పై దోమకాటు ద్వారా ఈ వ్యాధి వస్తుంది ఈ జాతి దోమ పైన నల్లటిని తెల్లని తారాలు ఉన్నటవలన దీనిని టైగర్ దోమ అని కూడా పిలుస్తారు.ఈ దోమలో ఇంటి లోపల ఆవరణలో ఉంటాయి. పగటిపూట మాత్రమే కుడతాయి ఇవి ఎక్కువ దూరం 600 మీటర్లు ఎగర లేవు అన్ని రకాల దోమల కంటే ఈ దోమ చాలా బరువైనది డెంగ్యూ వైరస్ లో ఇన్ఫెక్ట్ అయినా దోమలలోనే కాకుండా దోమ గుడ్లలో కూడా ఈ వైరస్ ఉంటుంది.కాబట్టి త్వరితగతిన ఎక్కువ మందికి వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుంది. ఈ దోమ మంచినీటి నిల్వలలో మాత్రమే గుడ్లు పెడుతుంది ఈ వైరస్ వలన ఒకటికంటే ఎక్కువసార్లు కూడా డెంగు రావచ్చు. వ్యాధి లక్షణాలు గురించి డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ. డెంగ్యూ దోమ వల్ల అకస్మాకంగా తీవ్రమైన జ్వరం తలనొప్పి విపరీతమైన కండరాలు కీళ్ల నొప్పులు కాళ్ళ నొప్పులు కంటి కదలిక తగ్గటం నొప్పి ఉండటం ఒక్కొక్కసారి శరీరంలో ఎర్రటి దగ్గర్లో చిగుళ్ల నుండి రక్తస్రావం అధిక దాహం పెదవులు ఎండిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. డెంగ్యూ వ్యాధి మూడు రకాలుగా బయటపడవద్దు డెంగ్యూ జ్వరం. డెంగి హేమ రేస్ జ్వరం. షాక్ సింద్రోమ్ అంతర్గత కాలము డెంగ్యూ వైరస్ ఇంపాక్ట్ అయిన దోమ కాటు తర్వాత మూడు నుండి 14 రోజులలో డెంగ్యూ వ్యాధి రావచ్చు డెంగ్యూ వైరస్ తో ఇన్ ఫాక్ట్ అయిన తర్వాత సాధారణంగా 80 శాతం మందికి దానంతట అదే తగ్గిపోతుంది. వీరికి దద్దర్లు వచ్చిన సమయంలో రక్తంలో ప్లేట్ లెట్స్ తగ్గిన సాధారణ స్థితికి చేరుకుంటారు. రెండు రకాల లో డెంగీ హేమరేజ్ డెంగ్యూ షాక్ సిమ్రాన్ రక్తంలో ఈ ప్లేట్ లెట్స్ బాగా తగ్గటం వల్ల వీరికి ఆసుపత్రిలో చికిత్స అవసరం. డెంగ్యూ వ్యాధి లక్షణాలు రాకుండా ఉండడానికి జాగ్రత్తలు తెలియజేసిన. డాక్టర్ సుజాత డాక్టర్ కార్తీక్. ఇంటి లోపల మరియు ఇంటి ఆవరణలో ఎక్కడ మూత లేకుండా కొద్దిగా నీళ్ళు కూడా నిల్వ ఉండకూడదు ఉదాహరణకు పూలకుండీల క్రింద కొబ్బరి బోండాలు పనికిరాని వస్తువులు పాత టైర్లు తాగి పడేసిన టీ కప్పులు సీసాలు ట్యాంకులు పంపులు కూలర్లు నీటి గుంటలో మొదలగున్నవి ఇంటిలో నిలువలు ఉన్న పాత్రలపైన పైన మూతలు పెట్టాలి వారానికి ఒకసారి అన్ని నీటి నిలువలను పారపోసి పాత్రలను శుభ్రంగా తుడిచి పెట్టుకోవాలి .ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలి. ఇల్లు మరియు ఆవరణ ప్రతిరోజు ఉదయం సాయంత్రం శుభ్రం చేసుకోవాలి డెంగ్యూ అని అనుమానం వచ్చిన వెంటనే ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలి దోమలు కుట్టకుండా దోమతెరలు వాడుకోవాలి .వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి. దోమకార్డు ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి. దోమకాటు ఆరోగ్యానికి చేటు కనుక సమాజంలో ప్రతి ఒక్కరూ దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు తెలుసుకోవాలని మెడికల్ సిబ్బంది తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో న ా వ ర్ౖ ్వ జ ర్స్ వసుంధర. లక్ష్మీదేవి. వరలక్ష్మి. గంగ రత్నమ్మ. ప్రభాకర్. రవి . మరియు ఎం ఎల్ హెచ్ పి లు మరియు ఏఎన్ఎం. ఆశాలు. పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190